క్లుప్తంగా

ఎంఈఓ కార్యాలయానికి చేరిన విద్యా సామగ్రి

నాగలాపురం: స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్కూల్ కిట్లు శుక్రవారం ఉదయం చేరుకున్నాయని ఎంఈఓ బాబయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇందులో విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, డిక్షనరీలు, బెల్టు, షూలు, అన్నీ ఉన్నాయని పాఠశాలలు ప్రారంభించగానే ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులద్వారా విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు 16,210 నోట్ పుస్తకాలు చేరినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ నోట్‌బుక్స్‌ను అందజేస్తామని, ఈ లోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ప్రసూన, ఈశ్వరమ్మ, కృష్ణయ్య, లీలాప్రసాద్, పాల్గొన్నారు.

శర్మకు పూజా ఫలమిదే!

శ్రీకాళహస్తి: అత్యుత్సాహంతో రాఘవేంద్ర స్వామి మఠంలో సినీనటుడు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు నవగ్రహ శాంతి పూజలు చేసిన ఆలయ వేదపండితుడు మారుతీశర్మను సస్పెండ్ చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం వరకు హైడ్రామా నడిపిన అధికారులు చివరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఈ పాస్ మిషన్ల పరిశీలన



వెయింగ్ మిషన్లను పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారులు

సత్యవేడు: మండలంలోని రేషన్ డీలర్లు వినియోగించనున్న వెయింగ్ మిషన్లు, ఈ పాస్ మిషన్లను తూనికలు కొలతల అధికారులు వి.గణేష్‌పాత్రో, పి.హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని 55 రేషన్ షాపుల డీలర్ల వద్ద ఉన్న వెయింగ్ మిషన్లు, ఈ పాస్ మిషన్ల పనితీరును పరిశీలించారు. మరమ్మతులకు గురైన మిషన్లను ఆధునీకరించారు. మొబైల్ రేషన్ డెలివరీ(ఎండీయూ) వాహనాలను ప్రభుత్వం నిలిపివేసింది. జూన్ 1నుంచి రేషన్ షాపుల వద్ద డీలర్లు తెల్లకార్డు దారులకు రేషన్ సరుకులు అందజేయాల్సి ఉండడంతో ముందస్తుగా మిషన్లు పరిశీలిస్తున్నట్లు తూనికలు కొలతల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు సంఘం నాయకులు సునీల్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం తూనికల అధికారులు రమణయ్య, హేమంత్ రేషన్ షాపుల్లోని వేయింగ్ మెషిన్లు, ఈ పాస్ యంత్రాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల్లోనే సరుకులు ఇస్తుండడంతో ఏండీయూ ఆపరేటర్ల వద్ద వేయింగ్ మెషిన్లు, ఈ పాస్ యంత్రాలున్నాయని తెలిపారు. దీంతో మండలంలోని 28 రేషన్‌షాపుల్లోని వీటిని తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, డీలరు తదితరులు పాల్గొన్నారు.

పాత వీరాపురంలో పోతురాజు ఊరేగింపు



ఏర్పేడు: మండలంలో పాత వీరాపురంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో 51వ మహాభారత ఉత్సవాలు శుక్రవారం పోతురాజు ఊరేగింపుతో మొదలయ్యాయి. పోతురాజును ప్రత్యేకంగా అలరించి పురవీధులతోపాటు మాధవమాల, గుండ్రాళ్లమిట్ట, మల్లవరం, ఇసుకతాగేలి గ్రామాల్లోనూ ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, ఆలయ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి, కావలి బాలాజి, మనోహర్ రెడ్డి పాలొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

శ్రీకాళహస్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. ×యోగాంధ్ర×లో భాగంగా శుక్రవారం పోలీసులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడారు. రోజూ అరగంట పాటు యోగాసనాలు వేస్తే ఏ రుగ్మతలూ దరిచేరవన్నారు. 1వ పట్టణ సీఐ గోపి, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాగలాపురం: పిచ్చాటూరు మండలం, పులికుండ్రంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ ఇలంగోవ రెడ్డి తెలిపారు. అనంతరం సీసీ రోడ్డును ప్రారంభిస్తారన్నారు.

కూటమి భోజ్యం..
ఉపాధి పూజ్యం

- రాజకీయ రంగు పులిమి ఫీల్డ్ అసిసెంట్లు, మేట్ల తొలగింపు
- తొలగింపుతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్న వైనం
- టీడీపీ నాయకులు చెప్పిందే శాసనం
- ఉపాధి హామీ కూలీలకు నెలల తరబడి పెండింగ్‌లో కూలి డబ్బులు
- పని వద్ద మౌలిక వసతులు కరువే



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేస్తున్న ఉపాధి హామీ పనులు

ఏర్పేడు: కేంద్రప్రభుత్వం వలసలను నిరోధించడానికి అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, రాజకీయ రంగు పులిమి, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను తొలగించి కడుపు కొట్టారు. కూటమి నేతలు చెప్పిన వారికే పనులు కల్పిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. తమను నిష్కారణంగా తొలగించారని మండల స్థాయి మొదలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తమ గోడు నివేదించినా పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఫలితంగా 'ఉపాధి' లేక కుటుంబ పోషణకు అగచాట్లు పడుతున్నారు. వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ పాలనలో కూలీలకు మెరుగైన గిట్టుబాటు కూలి కల్పించడంతోపాటు నగదు సకాలంలో చెల్లించేవారు. అయితే ప్రస్తుతం నెలల తరబడి చేసిన పనులకు కూలి సొమ్ము చేతికందక పేదలు నిరీక్షిస్తున్న దయనీయ పరిస్థితి మరోవైపు కనిపిస్తోంది.

ఉపాధి హామీ పథకాన్ని వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం చట్టంగా తీసుకొచ్చింది. ఈ పథకంలో పని చేసిన కూలీలకు గత ప్రభుత్వ హయాంలో రోజుకు రూ.325 నిర్ణయించి ప్రతివారం ఠంఛనుగా పోస్టాఫీసు ఖాతాలకు నగదు జమ చేసేవారు. అలాగే ఉపాధి పనుల్లో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకుండా మామిడి చెట్లు, ఇతర ఉద్యాన పంటల సాగుకు ఊతమందించారు. గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి జాబ్‌కార్డుదారులే పనులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛనిచ్చి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఉపాధి నిధులతో సిమెంటు రోడ్లు వేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మీదే తొలివేటు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదట రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు రాజకీయాలను ఆపాదించి ఎక్కడికక్కడ బలవంతంగా రాజీనామా చేయించి కొందరిని, రాజీనామా చేయని వారిపై అవినీతి అక్రమాల మరకలు పూసి ఫిర్యాదులందాయని తొలగించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధికంగా 53 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు.

జాబ్‌కార్డుల వివరాలు

శ్రీకాళహస్తి నియోజకవర్గం		
శ్రీకాళహస్తి	:	10,484
ఏర్పేడు	:	9,586
రేణిగుంట	:	4,969
తొట్టంబేడు	:	8,791
మొత్తం	:	33,830

సత్యవేడు నియోజకవర్గం		
సత్యవేడు	:	9,346
వరదయ్యపాళెం	:	7,395
బుచ్చినాయుడు కండ్రిగ	:	6,846
కేవీబీ పురం	:	9,785
నాగలాపురం	:	7,090
నారాయణవనం	:	7,468
పిచ్చాటూరు	:	5,886
మొత్తం	:	53,816

పనుల ప్రదేశంలో సౌకర్యాలు నిల్

ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశాలలో ఎండ వేడిమికి ఉపశమనంగా తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేయటంతోపాటు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులను అందుబాటులో ఉంచాలి. అయితే వాటి ఊసే లేదు. నీళ్లు మాత్రమే ఉంచి చేతులు దులుపుకున్నారు. ఇక పనులను చేసేందుకు పార, గడ్డపార, తట్టలను జాబ్‌కార్డుదారులకు ఇవ్వాల్సి ఉండగా, అరకొరగానే ఉన్నాయి. దీంతో పని ఆలస్యమవుతోంది. ఆ ప్రభావం చివరకు కూలీ గిట్టుబాటుపై పడుతోంది.

గతంలోనే కూలి గిట్టుబాటు అయ్యేది



మాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ పనులకు వెళితే కూలి గిట్టుబాటు అయ్యేది. డబ్బులు కూడా సకాలంలో మా పోస్టాఫీసు ఖాతాలకు పడేది. పనుల కోసం వేరే ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి కలగలేదు. ప్రస్తుతం కూలీ డబ్బులు ఆలస్యంగా వేస్తున్నారు.

– ధనంజయులు, ఉపాధి కూలీ, కేవీబీపురం మండలం

ఆలస్యంగా డబ్బులు



కూలి పనులకు సంబంధించి మాకు రావాల్సిన డబ్బులు ఆలస్యంగా పడుతోంది. దీంతో పని చేసినా డబ్బులు చేతికందకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదు. పనులు చేసే ప్రాంతంలో వసతులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. గతంలో మాకు వారం..వారం కూలి మొత్తాలు ఖాతాలకు జమ చేసేవారు.

-విమలమ్మ, ఎల్లమండ్యం, రేణిగుంట మండలం

రాజకీయ కక్షతోనే తొలగింపు



2006 నుంచి ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. సుమారుగా 20 ఏళ్లు పనిచేస్తున్న నన్ను రాజకీయ కక్షతో టీడీపీ నాయకులు నన్ను తొలగించారు. ప్రైవేటు కంపెనీలకు వెళ్లినా వయసు రీత్యా ఉద్యోగానికి తీసుకోలేదు. దీంతో నా ఉపాధి పోయింది. నాలాగే ఎంతోమంది కింద స్థాయి సిబ్బందిని టీడీపీ నాయకులు తొలగించారు. కూటమి ప్రభుత్వం మాపాలిట శాపంగా మారింది.

-శేఖర్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, కృష్ణాపురం

పనులు కల్పించడం లేదు



గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి ఉపాధి హామీ పనులను ఎంపిక చేయాలి. ప్రతి గ్రామంలోనూ పనికి వచ్చేవారందరికి జాబ్‌కార్డులు ఇవ్వాలి. కూలీలందరికి 100రోజులను పని కల్పిస్తామంటున్నా అధికారుల అలసత్వం వల్ల పనులను కల్పించడం లేదు.

-రంగయ్య, చిందేపల్లె, ఏర్పేడు మండలం

నూకతోటి నివాళి



యేసయ్యకు నివాళులర్పిస్తున్న రాజేష్

నారాయణవనం: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యేసయ్యకు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నివాళులర్పించారు. గోవిందప్పనాయుడుకండ్రిగ దళితవాడకు చెందిన యేసయ్య అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. సమాచారమందుకున్న నూకతోటితోపాటు మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యవర్గ కార్యదర్శి రాకేష్‌కిరణ్, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్ మురళి, నాయకులు అశోక్, పీజీ బాబు, మంజునాథ్, చీరాలయ్య తదితరులు యేసయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూటమి సర్కార్ చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న రాజేష్ తదితరులు


నారాయణవనం: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేకపోయినా మహానాడులో గొప్పలు చెప్పుకుందని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. ఆయన శుక్రవారం సాయంత్రం పార్టీ శ్రేణులతో కలిసి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. గ్రామ స్వరాజ్యం అంటే ఏంటో జగనన్న చేసి చూపించారని గుర్తుచేశారు. గడప వద్దకే సేవలను అందించి దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిచారని ప్రశంసించారు. అయితే ఈ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. వచ్చిందే పనిగా సచివాలయాలను నిర్వీర్యం చేస్తూ గడప వద్దకే అందుతున్న సేవలన్నింటికీ మంగళం పాడిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను నిష్కారణంగా తీసేస్తున్నారన్నారు. కేవీబీ పురం మండలంలో ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్ తప్ప అందరినీ తొలగించారని గుర్తు చేశారు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, వారే గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యవర్గ కార్యదర్శి రాకేష్‌కిరణ్, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ రవి, నాయకులు దొరైరాజ్, అశోక్, పీజీ బాబు, మంజునాథ్, చీరాలయ్య, మూర్తి, సంపత్, కుప్పయ్య, షణ్ముగం పాల్గొన్నారు.

శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం



శిబిరంలో విద్యార్థులు, టీచర్లు, అధికారులు

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు) తమకు విజ్ఞానంతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పంచిందని విద్యార్థులు తెలిపారు. ఏప్రిల్ 9న ప్రారంభమైన ఈ శిబిరం శుక్రవారం ముగిసింది. స్థానిక ఈఎంసీ సమావేశ మందిరంలో సాయంత్రం ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఉచిత భోజనం, వాహనం వసతితో పాటు చక్కని శిబిరం ఏర్పాటు చేశారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. శిబిరానికి 9, 10, 11 తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 175 మంది హాజరయ్యారు. స్పోకెన్ ఇంగ్లిష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు, రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల్లో మెలకువలు, జనరల్ నాలెడ్జ్, ప్రపంచ వార్తలు తదితర అంశాలు బోధించారు. యోగా, కరాటే, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ఫైర్‌సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సపై ప్రత్యేక అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సుల్లో ఈ కార్యక్రమాన్ని రూపొందించి మార్గనిర్దేశం చేశారు. విజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతమైందన్నారు. అధ్యాపక బృందం రంజిత్, దుష్యంత్, ఉమా, నేహా, సాయిలక్ష్మి, సౌమ్య, కోదండంను ఆమె అభినందించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) రమేష్‌కుమార్, శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ డాక్టర్ సులోచన శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.




రేణిగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ, ముస్లింలు

దేశ సమైక్యత అందరి బాధ్యత

రేణిగుంట: ఉగ్రవాదం-మతోన్మాదం నశించాలి, మత సామరస్యం-దేశ సమైక్యత మనందరి బాధ్యత అని నినాదాలు చేస్తూ రేణిగుంటలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ర్యాలీ నిర్వహించారు.ఇస్మాయిల్ మసీదు నుంచి బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వెంకటరమణ, హరినాథ్, సెల్వరాజ్, ఈశ్వరమ్మ, ముస్లిం మైనారిటీ నాయకులు సహజ, యోగేష్, ఇస్మాయిల్, రఫీ ఉల్లా, సాదిక్ బాషా, షేక్ బాషా, షాజహాన్, ఖాదర్ బాషా, డ్రైవర్ వల్లి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పేరిట వసూళ్లు



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న సీఐ

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ సమీపంలోని ఆరణియార్‌లో ఇటీవల ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇది తెలుసుకున్న మండలానికి చెందిన ట్రాక్టర్ యజమానులు కొందరు ఇతర మండలాలకు చెందిన ట్రాక్టర్ల నుంచి పోలీసుల పేరిట మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇది కాస్త ఆ నోటా ఈ నోట పడి పోలీసుల చెవికి చేరింది. దీంతో ఆగ్రహించిన సత్యవేడు సీఐ మురళి నాయుడు, నాగలాపురం ఎస్ఐ సునీల్ సుబ్బనాయుడు తమ సిబ్బందితో కలిసి కండ్రిగ వద్ద అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇసుక ట్రాక్టర్లపై శుక్రవారం కొరడా ఝళిపించారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న వారిని విచారణ చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

నీటి సమస్య పరిష్కారం

నారాయణవనం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నీటి సదుపాయం కల్పించాలంటూ రెండు వారాల క్రితం మహిళలు పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. స్పందించిన ఈవో షణ్ముగం సమీపంలోని చేతి పంపును తొలగించి శుక్రవారం బోరు, మోటారును ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో వీధుల్లో పబ్లిక్ కొళాయిలు ఏర్పాటు చేస్తామని ఈవో పేర్కొన్నారు.

చెత్తతో ఆదాయం పెంచుకోండి

నారాయణవనం: ఇళ్ల వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చుకుని విక్రయించడంతో పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవచ్చని ఎంపీడీవో గుణశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో డాక్టర్ వేణయ్య పేర్కొన్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు నారాయణవనంలోని సంపద కేంద్రంలో ఒక రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఎరువు తయారీ విధానాన్ని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతికతతో వ్యవసాయం సులభతరం

వరదయ్యపాళెం: అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో సులభతరంగా వ్యవసాయం చేసుకునే పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞానకేంద్రం హెడ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, తొండంబట్టు, కళత్తూరు, పెద్ద పాండూరు గ్రామాల్లో శుక్రవారం రైతులతో సమావేశమయ్యారు. ఐసీఏఆర్ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌కుమార్, సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం, ఏఓ గౌరి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య, హార్టికల్చర్ ఏఓ రాధారాణి, మండల పశువైద్యాధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ గౌరి యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు శీనురెడ్డి, ప్రతాప్ రెడ్డి, నాగరాజు యాదవ్, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేస్తాం



కూనాటి రమణయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ స్పష్టం చేశారు. పార్టీ నూతన మండల కార్యవర్గం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపింది. బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, కష్టకాలంలో పార్టీకి తోడుగా ఉన్న వారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. అనంతరం వారిని సన్మానించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మునికృష్ణారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, తాళ్లపాక నాగార్జురెడ్డి, మోహన్ రెడ్డి, నారాయణ, లోకనాథం రెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణు, గాలి గుణశేఖరనాయుడు, జల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల మీద నుంచి పడి విలేకరి మృతి



నివాళులు అర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: కాలు జారి మెట్ల మీద నుంచి పడి పాత్రికేయుడు మరణించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. తొట్టంబేడులో ఒక దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న సి.మెహర్ (45) గురువారం రాత్రి మెట్ల మీద నుంచి జారి పడి మరణించాడు. ఇది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం మెహర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు పార్టీ, మైనారిటీ నాయకులు, పాలక మండలి మాజీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, తొట్టంబేడు ఎంపీపీ ఉన్నం నిర్మల, బొజ్జల బృందమ్మ, మునిరాజానాయుడు, గాలి మురళినాయుడు, విజయకుమార్‌నాయుడు తదితరులు నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం.వేణుగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ధనశేఖర్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో కూలీలకు నీరు, నీడ, వంటి వసతులతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ సిబ్బందిని ఆదేశించారు. ఆమె శుక్రవారం పార్లపల్లెలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కూలీలు 4గంటల పాటు పని చేస్తే రూ.272 కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పనిచేయాలని, కూలీల టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని తెలిపారు. పండ్లతోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


'నమ్మించి దగా చేసిన ఆలయ అధికారులు'

శ్రీకాళహస్తి: తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తెయనాయుడును ముక్కంటి ఆలయ ఉచిత సేవకులు కోరారు. శుక్రవారం ఆయనను కలిసి వారు కోరారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తమ వినతిపై స్పందించి, తమకు జీతభత్యాల అంశాన్ని ట్రస్టుబోర్డు సమావేశంలో చేర్చి, ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. అలాగే దేవదాయశాఖ కమిషనర్ దక్షిణామూర్తి స్పందించి ఏజెన్సీ ద్వారా జీతాలు ఇచ్చేందుకు అనుమతించారని, ఎన్నో ఏళ్లుగా ఉచితంగా పనిచేసిన తమకు జీతాలు వస్తే ఇప్పుడు తమ ఆర్డర్ కాపీలో కొత్తవారి పేర్లను చేర్చి కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా ఆలయ అధికారులు తమకు జీతాలు ఇస్తామని నమ్మించి కొత్తవారికి విధులు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్, రంగయ్య, వంశీ, తులసీరాం, దామోదరం, గోపి, మునిబాబు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యల పరిష్కారానికి వినతి

వరదయ్యపాళెం: నూతన రేషన్ కార్డులు పొందేందుకు తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని మండల వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం తహసీల్దార్ సుధీర్ రెడ్డిని కలసి విన్నవించారు. ప్రధానంగా మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన వల్ల పలువురు రేషన్ కార్డు పొందలేక పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, మాజీ దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సీఎల్ఎన్ పల్లి సర్పంచ్ దుడ్డు వేణు, నాయకులు నానిరెడ్డి, సునీల్, రమేష్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఆందోళన



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో తహానగర్‌లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలకు సంబంధించిన స్థలాల ఆక్రమణను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉన్న భూమిని ఇదే గ్రామానికి చెందిన చెంచమ్మ ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకుందన్నారు. ఆక్రమణను తొలగించాలని కోరితే గొడవకు వస్తున్నారని,దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని నిరసించారు.

తహసీల్దార్ సేవలు మరువలేనివి

కేవీబీపురం: తహసీల్దార్ మునిరత్నం సేవలు మరువలేనివి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. తహసీల్దార్ మునిరత్నం శుక్రవారం ఉద్యోగ విరమణ పురస్కరించుకుని వీడ్కోలు సన్మానం చేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్డీఓ భానుప్రకాష్ తదితరులు ఆయన సేవలను ప్రస్తుతించారు.